క్లుప్తంగా

పూలే గురుకులంలో 'హెల్త్ డే'

వర్గల్(గజ్వేల్): దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 'హెల్త్ డే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు కళాశాల హెల్త్ క్లినిక్‌లో అందుబాటులో ఉన్న వివిధ టానిక్‌లు, మందులు, వైద్యపరీక్షలకు సంబంధించిన స్టెత స్కోప్, బీపీ చెకింగ్ తదితర పరికరాలను ప్రదర్శించారు. కళాశాల ఆరోగ్య పరిరక్షణ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

ఓటరు నమోదు అంశంపై ఆర్డీఓ సమావేశం

గజ్వేల్: ఓటరు నమోదు అంశంపై సోమవారం గజ్వేల్ ఆర్డీఓ వీవీఎల్ చంద్రకళ రాజకీయ పార్టీల నేతలతో సోమవారం తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా మార్పులు, చేర్పులపై నాయకుల అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలని వినూత్న నిరసన

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి–పోతారం రోడ్డు పై ఉన్న గుంతలను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గుంతలలో బైక్‌ను పడేసి వినూత్నంగా నిరసన చేపట్టారు. కొన్నేండ్లుగా రోడ్డు మరమ్మతులు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎల్లయ్య, సాయికృష్ణ, లింగం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

దుబ్బాకటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ. 18వేల వేతనం, ప్రమోషన్, పీఎఫ్, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ.. సోమవారం దుబ్బాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, శ్యామల, శారద, చంద్రకళ, సంతోష, వసుంధర పాల్గొన్నారు.

వ్యాపార బలోపేతానికి దోహదం



మాట్లాడుతున్న సెట్విన్ ఇన్‌చార్జి అమీనాభాను

సిద్దిపేటజోన్: భారత ప్రభుత్వం మైక్రో, స్మాల్ అండ్ మీడియం సంస్థ ద్వారా వ్యాపార బలోపేతానికి ప్రణాళికలు చేపట్టిందని సిద్దిపేట సెట్విన్ ఇన్‌చార్జి అమీనాభాను పేర్కొన్నారు. సోమవారం స్థానిక సెట్విన్ కేంద్రంలో మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థ నిర్మాణం, వ్యాపారాలు, మార్కెట్ ఉనికిని మెరుగుపరచడానికి ఒక ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, నైపుణ్య అంశాలు, సబ్సిడీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పంటకు దిష్టిబొమ్మ



పంటలో పెట్టిన పోస్టర్లు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పంటకు దిష్టి తగలకుండా సినిమా హీరోయిన్ ఫొటో, కోతుల బెడద లేకుండా కొండంగి ఫొటో పోస్టర్లను వినూత్నంగా పెట్టాడు ఓ రైతు. మండలంలోని ఎల్లాయిగూడ గ్రామంలో మిర్చి, టమాట పంటను రైతు సాగు చేస్తున్నారు. హీరోయిన్ ఫొటోతో నన్ను చూసి ఏడవకు అంటూ రాసి పెట్టారు.

ఎవరి వాటా ఎంత?

- పాఠశాలల పనుల్లో చేతివాటంపై చర్చనీయాంశం
- చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు
- ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు
- చోద్యం చూస్తున్న అధికారులు



కలెక్టర్‌కు కమీషన్లపై మొర పెట్టుకుంటున్న అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన బిల్లుల చెల్లింపునకు పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది భారీగానే కమీషన్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత శనివారం మండలంలోని గురువన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత బోధన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మనుచౌదరికి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల చైర్మన్‌లు కమీషన్ల విషయమై మొరపెట్టుకున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ శివకుమార్ ప్రైవేటుగా నియమించుకున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో పాటు డీఈ ఆఫీస్ సిబ్బంది మజీద్‌లు బిల్లుల చెల్లింపు కోసం రూ.7500ల చొప్పున తీసుకున్నారని, పెండింగ్‌లో ఉన్న బిల్లుల కోసం మరిన్ని డబ్బులు కావాలని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించిన విషయం పాఠకులకు విదితమే. కాగా ఈ సిబ్బంది కేవలం గురువన్నపేట పాఠశాలలో చేపట్టిన పనుల్లోనే కాకుండా మండల వ్యాప్తంగా చేపట్టిన పనుల బిల్లుల విషయంలోనూ ఇదే విధంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూలు చేసిన డబ్బులు కేవలం వారిరువురే వాటాలు వేసుకున్నారా? అధికారులకు ఇచ్చారా? అధికారుల పేరు చెప్పి వారే వసూలు చేశారా? అనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గురువన్నపేటకు కలెక్టర్ రావడంతో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు సమస్యను విన్నవించడంతో బిల్లుల చెల్లింపు హామీ ఇచ్చారు. మిగతా గ్రామాల్లో కొంత మంది చైర్మన్లు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కానీ ఫిర్యాదు చేసిన తర్వాత అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకుంటారా? లేదా సదరు అధికారులు పెండింగ్ బిల్లులు చెల్లిస్తారో లేదోనని కొంత మంది సందిగ్ధంలో ఉన్నట్లు సమాచారం.

'సద్దిమూట' పుస్తకావిష్కరణ

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎండీ సయ్యద్ రచించిన సద్దిమూట అనే పుస్తకాన్ని సోమవారం ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ రోజా శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సద్ది మూట అనే పుస్తకం విద్యార్థుల భవిష్యత్తుకు, సమాజాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అనంతరం పాఠశాలకు కంప్యూటర్ సామగ్రిని రోజాశర్మ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మెరుగు కృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రఘోత్తం రెడ్డి

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ
- పలు చోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న పూజల హరికృష్ణ

సిద్దిపేటరూరల్: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో రూ. 15 లక్షలు, రాఘవాపూర్‌లో ఉపాధిహామీ పథకం నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామంలో డ్రైనేజీలను కూడా త్వరలో నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.

చంద్లాపూర్‌లో సీసీ రోడ్డు పనులు..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రకళ రవి, మాజీ ఎంపీటీసీ సభ్యులు దుర్గారెడ్డి, చంద్రమౌళి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మహేందర్ రెడ్డి, లింగం పాల్గొన్నారు.

ధర్మసాగర్‌పల్లి గ్రామంలో..

కోహెడరూరల్(హుస్నాబాద్): కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వేంకటేశం అన్నారు. సోమవారం మండలంలోని ధర్మసాగర్‌పల్లి గ్రామంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మంజూరు చేసిన రూ.10లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, రమేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో రూ. 2 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, మరో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు మోటరును దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ స్వామి గౌడ్, మాజీ ఎంపీటీసీ ఉమారాణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవి, జిల్లా కార్యదర్శి కమలాకర్, జిల్లా నాయకులు అమర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడికందులలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందులలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ 10లక్షలతో పెద్దమ్మ, మహంకాళి దేవాలయాల వద్ద రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు.

నాచగిరి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ

వర్గల్(గజ్వేల్): సమన్వయంతో నాచగిరి క్షేత్రంలో లక్ష్మీనృసింహ స్వామి వారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ అన్నారు. ఈ నెల 19 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నాచగిరి క్షేత్రంలో వివిధ శాఖలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. క్షేత్రంలో పారిశుధ్య సమస్య, అసంపూర్తి మురుగు కాలువలు, స్నానపు ఘాట్లపై ఇరిగేషన్ ఏఈతో సమీక్షించారు. తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ విశ్వనాథశర్మ, తహసీల్దార్ బాల్‌రాజు, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఎంపీఓ ఖలీమ్, అధికారులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

గజ్వేల్‌రూరల్: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సోమవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్ ఫోర్స్, పోలీసుల కథనం ప్రకారం... ఆర్‌అండ్ఆర్ కాలనీలో కొంతమంది పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 15, 850 నగదుతో పాటు 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని, పేకాట, జూదం ఆడినట్లు తెలిస్తే 87126 67445, 8712667446, 87126 67447 నంబర్లకు లేదా గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 22 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.36వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

సిద్దిపేటకమాన్: మహిళ అదృశ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. హైదరాబాద్ బోరబండకు చెందిన మ్యారేజ్ బ్యూరో నిర్వహిస్తున్న వీరంశెట్టి రామారావు తన భార్య వరలక్ష్మి (54)తో కలిసి సిద్దిపేట హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న వీరి చిన్న కూతురు గందె వైష్ణవి వద్ద నాలుగేండ్ల నుంచి ఉంటున్నారు. వరలక్ష్మి ఆరోగ్యం బాగా లేకపోవడంతో రామారావు పట్టణంలోని బస్టాండ్ వద్ద హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కించాడు. కానీ ఆమె హైదరాబాద్‌కు చేరలేదు, తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆమె బస్సు ఎక్కే సమయంలో మెడలో 15తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు. భర్త రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల చేతుల్లోనే సమాజ భవిష్యత్తు

ములుగు ఎంపీడీఓ స్వర్ణకుమారి



పాఠశాలకు ఫర్నిచర్‌ను అందజేస్తున్న దాతలు

ములుగు(గజ్వేల్): విద్యార్థుల చేతుల్లోనే సమాజ భవిష్యత్తు ఉందని ఎంపీడీఓ మేరీ స్వర్ణకుమారి అన్నారు. ములుగు మండలం సింగన్నగూడ ప్రాథమిక పాఠశాలకు సోమవారం దాతలు గ్రామ మాజీ సర్పంచ్ బాలకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ స్వామిగౌడ్‌లు రూ.26 వేలు విలువ చేసే టేబుళ్లు, కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. విదార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ భాస్కర్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారి రామచంద్రం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రహీం, పాఠశాల హెచ్ఎం క్రాంతి కుమారి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ భవాని, వీఓఏ వాణి, పంచాయతీ సెక్రెటరీ సతీశ్‌రెడ్డి, నాయకులు భాస్కర్, చరణ్, నవీమ్, భిక్షపతి, హరీష్, నర్సింగరావు, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే ఉత్తమ ఫలితాలు

దుబ్బాక సీఐ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

దుబ్బాకటౌన్: విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 21 నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో సోమవారం దుబ్బాక పట్టణంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్ష సమయంలో అనవసరమైన ఒత్తిడికి, ఆందోళనకు గురికావడంతో దాని ప్రభావం పరీక్షలపై పడుతుందని సూచించారు. ప్రతీ విద్యార్థి ప్రణాళికను రూపొందించుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి స్వాతి ఉపాధ్యాయులు నిషా, హైమ, నాగరాణి, నాగలక్ష్మి, చంద్రకళ, కృష్ణవేణి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అవార్డును అందుకుంటున్న అంగన్‌వాడీ టీచర్

దుబ్బాకటౌన్: పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అక్షర జ్ఞానంతోనే చైతన్యవంతులవుతారని దళిత ఆదివాసి లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.ఎన్. రత్న, విద్యావేత్త డా.కొరవి వినయకళ అన్నారు. హైదరాబాద్‌లో ఆదర్శ సేవా సమితి ఎన్జీవో ఆధ్వర్యంలో సుధామాల అంజలి కుమారి అధ్యక్షతన ప్రపంచ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దౌల్తాబాద్ అంగన్‌వాడీ టీచర్ సుల్తానా ఉమర్‌ను సన్మానించి అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూ జేఏసీ చైర్మన్ సుల్తాన్, యాదగిరి తదితరులున్నారు.

వరిలో కాండం తొలుచు నివారణకు చర్యలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో శివకుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): వరి పంటలో కాండం తొలుచు ఉధృతి ఎక్కువగా ఉందని ముందుగా గుర్తించి రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఏఈవో శివకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణకు క్లోరోత్ ఎంపోరియం, 10శాతం ల్యామిడో కోతిరిన్‌ను పిచికారీ చేయాలన్నారు. వరి పంట సంరక్షణలో సలహాలు సూచనల కోసం వ్యవసాయ అధికారులను సంప్రందిచాలని రైతులకు సూచించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మద్దూరు(హుస్నాబాద్): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు లద్నూరు ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా?

అక్కన్నపేట(హుస్నాబాద్): పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా అని మాజీ సర్పంచులు జిల్లెల అశోక్‌రెడ్డి, గద్దల రమేశ్ మండిపడ్డారు. బంగారు ఆభరణాలు తనఖా పెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేశామని వాపోయారు.పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు వెళ్తున్న అక్కన్నపేట మండలంలోని కట్కూర్, చౌటపల్లి, మైసమ్మవాగు తండా, గొల్లపెల్లి, గొల్లకుంట గ్రామాల మాజీ సర్పంచులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిల్లులు చెల్లించాలని పలు సార్లు ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాలు సమర్పించామని, కానీ స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యాదగిరి, సంపత్‌కుమార్, లావణ్య కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

◆ కట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ఉచితంగా ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లను గ్రామానికి చెందిన బాలరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మ అన్నారు.సోమవారం మండలంలోని శనిగరం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని నాగసముద్రాల గ్రామంలో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ కొడముంజ రాజు పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ తన భార్య, కుమారుడితో పాటు గ్రామానికి చెందిన పలువురి పై జాబ్‌కార్డులు సృష్టించి లక్షల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

◆ జాబ్ మేళాలో 23 మంది ఎంపిక

హుస్నాబాద్: హుస్నాబాద్‌లోని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. టెక్ జెనిక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూకు 60 మంది హాజరయ్యారు. అసెంబ్లీ ఆపరేటర్లుగా, ప్రొడక్షన్ లైన్ ట్రైనీలుగా, క్రెడిట్ కార్డ్స్ సేల్స్, టెలికాలర్ ఉద్యోగాల కోసం 23 మంది ఎంపికైనట్లు సంస్థ డైరెక్టర్ కొండా శ్యాంసుందర్ తెలిపారు.

◆ శిష్యురాలిని సన్మానించిన గురువు

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ ఎంపీ రఘునందన్ రావు 1989–90లో టీచర్‌గా పని చేస్తున్న రోజుల్లో, సిద్దిపేటలో పదవ తరగతి వరకు ఆయన వద్ద పద్మజ విద్య నభ్యసించారు. ఆమె ప్రస్తుతం మండల పరిధిలోని అల్వాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మిరుదొడ్డిలో విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమం వేదికైంది. తన వద్ద విద్యనభ్యసించిన శిష్యురాలు, ప్రధానోపాధ్యాయురాలి హోదాలో కనిపించిన పద్మజను ఎంపీ వేదిక మీదికి ఆహ్వానించి సత్కరించారు. గురు శిష్యులు ఒకే వేదికపై సమున్నతమైన హోదాలో కనిపించే సరికి అక్కడున్న ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేశారు.

◆ మల్లన్నసాగర్ నిర్వాసితులను ఆదుకోవాలి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సరిపడా నిధులు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్ఆర్ కాలనీలో నివాసముంటున్న నిర్వాసితులు సమస్యలతో సతమతమవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారికి రావాల్సిన ప్యాకేజీ, పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించాలని తెలిపారు.

◆ అశ్రునయనాలతో అంత్యక్రియలు

తొగుట(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో అర్ధాంతరంగా తనువు చాలించిన భార్యాభర్తల అంత్యక్రియలు మండలంలోని ఎల్లారెడ్డిపేటలో సోమవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. భార్యాభర్తల అకాల మరణంతో నలుగురు చిన్నారులు మీనాక్షి (9), మహేశ్ (7), లక్ష్మి (5), శ్రవణ్ (4) అనాథలయ్యారు. తల్లిదండ్రుల అంత్యక్రియలను చిన్న కుమారుడు శ్రవణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి అకాల మరణంతో చలించిన పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి పాడె మోసి నివాళులు అర్పించారు. పలువురు దాతలు అందించిన ఆర్థిక సహాయంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

◆ సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

తొగుట(దుబ్బాక): మండలంలో చందాపూర్‌కు చెందిన వరగంటి సత్యలక్ష్మికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.28వేల 300 చెక్కును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

◆ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

గజ్వేల్‌రూరల్: నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు అలవాటేనని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందగా వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రాజిరెడ్డి, రమేశ్ గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్, కిష్టారెడ్డి, రాములుగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

◆ కార్యకర్తకు ప్రమాద బీమా చెక్కు అందజేత

కొండపాక(గజ్వేల్): కార్యకర్తలను కాపాడుకోవడం బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కుకునూరుపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త ముస్త్యాల నర్సిహులు కుటుంబానికి రూ. 2లక్షల ప్రమాద బీమా చెక్కును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలను ఆపద సమయాల్లో పార్టీ కాపాడుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవి రవిందర్, అమరేందర్, కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, శ్రీనివాస్, సద్గుణ, ఐలయ్య, సంపత్, ఆజీమొద్దీన్, శంకర్, అహ్మద్ పాల్గొన్నారు.